### మధ్యాహ్న భోజన మార్పులకు సూచన

మధ్యాహ్న భోజనం ఎట్టి పరిస్థితుల్లో కలుషితం కాకుండా చూడాలని ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ సూచించింది. మెనూలో పలు మార్పులను కూడా చేయాలని చెప్పింది. బిల్లులను ప్రతి వారం చెల్లించాలని అలాగే ఇంటర్మీడియట్‌లోనూ మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశపెట్టాలని సిఫారసు చేసింది. గురుకుల పాఠశాలల విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని పేర్కొంది.



## అంతర్జాతీయం

### ప్రపంచ ఆరోగ్య సంస్థ

- ఒంకోసెర్సియాసిస్ అనే వ్యాధిని నైగర్ పూర్తిగా అరికట్టింది. ఈ ఘనతను సాధించిన తొలి ఆఫ్రికా దేశంగా నిలిచింది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రియేసస్ ప్రకటించారు. ఈ వ్యాధిని రివర్ బ్లైండ్‌నెస్ అని కూడా పిలుస్తారు. ఈ వ్యాధిని అరికట్టిన తొలి దేశం కొలంబియా. అలాగే జార్జియాను మలేరియా రహిత దేశంగా ప్రకటించారు.



### ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు కూటమి

- స్విట్జర్లాండ్‌లోని కొలోగ్ని కేంద్రంగా పనిచేసే ప్రపంచ ఆర్థిక ఫోరం ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు కొత్త కూటమిని ఏర్పాటు చేసింది. 'గ్లోబల్ ప్లాస్టిక్ యాక్షన్ పార్ట్‌నర్‌షిప్'గా దీన్ని పిలుస్తారు. దేశం నుంచి మహారాష్ట్ర ఇందులో చేరింది. ప్రస్తుతం ఇందులో సభ్యత్వం 25కు చేరింది.

### ఇండోనేషియా

- వైద్య రంగంలో సహకారం, తీర భద్రత, సంప్రదాయ ఔషధాల నాణ్యత, డిజిటల్ రంగం, సాంస్కృతిక అంశాల్లో భారత్, ఇండోనేషియా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఏడాది నిర్వహించిన గణతంత్ర వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదు ఒప్పందాలను కుదుర్చుకున్నారు.

### పాకిస్థాన్

- భిక్షాటనను నేరంగా పాకిస్థాన్ ప్రకటించింది. ఇందుకు 'అక్రమ రవాణా నిరోధక (సవరణ) బిల్లును' ఆ దేశ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు.



### చైనా

- కైలాస్ మానస సరోవర్ యాత్ర పునరుద్ధరణతో పాటు నదీ జలాల సమాచార మార్పిడి, ప్రత్యక్షంగా భారత్, చైనా మధ్య విమాన సర్వీసులను ప్రారంభించాలని భారత్, చైనా విదేశాంగ శాఖ కార్యదర్శుల స్థాయి సమావేశంలో నిర్ణయించారు. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## రోజులు-ప్రాధాన్యం

### జనవరి 30

- ఏటా జనవరి 30న 'నెగ్లెక్టెడ్ ట్రోపికల్ డిసీజ్'డే గా నిర్వహిస్తారు. ఉష్ణ మండల ప్రాంతాల్లో వ్యాపించే వ్యాధులను కట్టడి చేసేందుకు ఉద్దేశించింది ఈ రోజు. ఈ వ్యాధులను అరికట్టేందుకు లండన్ ప్రకటనతో పాటు కిగాలి డిక్లరేషన్ కూడా ఉంది.

### జనవరి 29

- ఏటా జనవరి 29న దేశంలో ఇండియన్ న్యూస్ పేపర్ డే గా నిర్వహిస్తారు. దేశంలో తొలిసారి 1780, జనవరి 29న బెంగాల్ గెజిట్ పత్రిక ప్రారంభమైంది. దీన్ని ఆగస్టస్ హిక్కి ప్రారంభించారు. దీనికి గుర్తుగా జనవరి 29న ఇండియన్ న్యూస్ పేపర్ డేని ప్రవేశపెట్టారు.

### జనవరి 26

- ఏటా జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవంతో పాటు ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎనర్జీ, ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే గా నిర్వహిస్తారు.

## వార్తల్లో వ్యక్తులు

### శుభాంశు శుక్లా

- అమెరికా చేపట్టనున్న యాక్సియం మిషన్ 4కు భారత వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు చేపట్టిన ప్రైవేట్ మిషనే 'యాక్సియం 4'. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు.



### రాజేశ్ నిర్వాణ్

- బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీగా రాజేశ్ నిర్వాణ్‌ను కేంద్రం నియమించింది.

### మిలోస్ వుసెవిక్

- సెర్బియా దేశ ప్రధాని మిలోస్ వుసెవిక్ తన పదవికి రాజీనామా చేశారు. కొద్ది రోజుల కిందట ఆ దేశంలో రైలు ప్రమాదం జరగడం, తీవ్ర స్థాయిలో వ్యతిరేకత రావడమే ఆయన రాజీనామాకు కారణం.

## జాతీయం

### ఒకే దేశం ఒకే సమయం

- దేశ వ్యాప్తంగా ఒకే తరహా సమయాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తుంది. దేశంలో ఇప్పటి వరకు సమయం అమెరికాకు చెందిన జీపీఎస్ ఆధారంగా కొనసాగిస్తున్నారు. దీని స్థానంలో భారత్‌కు చెందిన నావిక్ వ్యవస్థను వినియోగించుకొని దేశం మొత్తం ఒకే తరహా సమయం ఉండాలని కేంద్రం ప్రతిపాదించింది.

### నేషనల్ క్రిటికల్ మిషన్

- రూ. 16,300 కోట్ల వ్యయంతో దేశంలో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పర్యావరణ అనుకూల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన ఖనిజాలను క్రిటికల్ మినరల్స్ అని పిలుస్తారు.

### భాషిణి

- కృత్రిమ మేధతో పనిచేసే భాష అనువాద



వ్యవస్థ భాషిణి. కేంద్రం దీన్ని 2022లో ప్రవేశపెట్టింది. తాజాగా ఇందులో త్రిపుర చేరింది. ఈశాన్య ప్రాంతంలో ఉంటూ భాషిణిలో చేరిన తొలి రాష్ట్రం ఇదే.

### సీఐఎస్ఎఫ్

- పూర్తిగా మహిళలతో కూడిన బెటాలియన్‌ను కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఏర్పాటు చేసింది. హర్యానాలోని నుహ్ జిల్లాలో ఇది అందుబాటులోకి వచ్చింది.

### ఉమ్మడి పౌర స్మృతి


- ఉమ్మడి పౌర స్మృతిని ఉత్తరాఖండ్ జనవరి 27 నుంచి అమలు చేస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ విధానాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రం ఇదే. ఆదేశిక సూత్రాల్లో ఆర్టికల్ 44లో ఉమ్మడి పౌరస్మృతి అమలుకు సంబంధించిన అంశం ఉంది.

### బిమ్ కాయిన్

- దేశంలో తొలిసారి విద్యారంగానికి చెందిన క్యాంపస్‌లో బ్లాక్ చెయిన్ సాంకేతికతతో పనిచేసే డిజిటల్ కరెన్సీని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ ప్రవేశపెట్టింది. క్యాంపస్‌లో చెల్లింపులు పారదర్శకంగా, సమర్థంగా జరిగేందుకు దీన్ని తీసుకొచ్చింది.

### ఎన్‌వీఎస్-02

- శ్రీహరికోట నుంచి ఇస్రో 100వ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టింది. జీఎస్



ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్‌ను వినియోగించి ఎన్‌వీఎస్-02 అనే నావిగేషన్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇది నావిక్‌లో భాగం.

### ఇథనాల్ ప్రొక్యూర్‌మెంట్ ధర

- ఇథనాల్ ప్రొక్యూర్‌మెంట్ ధరలను పెంచుతూ కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ ధర లీటర్ రూ. 56.58 ఉంది. ఇప్పటి నుంచి రూ. 57.97కు ఇవ్వనున్నారు.

### సెబీ

- భారత స్టాక్ మార్కెట్లో మైలురాళ్లను తెలిపేందుకు ఉద్దేశించి దారోహర్ అనే పేరుతో సెబీ కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది.

### వెట్‌ల్యాండ్ సిటీస్

- ప్రపంచ చిత్తడి నేలల నగరాల జాబితాలో దేశంలోని ఇండోర్, ఉదయ్‌పూర్‌కు స్థానం దక్కింది. ఈ జాబితాలో చేరిన భారత తొలి నగరాలు ఇవే. రామ్‌సర్ ఒప్పందంలో ఉంటూ నిర్వహణ సరిగా ఉన్న వాటిని ఈ జాబితాలో చేరుస్తారు.

## క్రీడలు

### 38వ జాతీయ క్రీడలు

- 38వ జాతీయ క్రీడలు ఉత్తరాఖండ్‌లో నిర్వహిస్తున్నారు. జనవరి 28న ఈ క్రీడలను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఫిబ్రవరి 14 వరకు కొనసాగుతాయి.




### ఖేలో ఇండియా

- ఐదో శీతాకాల ఖేలో ఇండియా క్రీడలు లడఖ్‌లో ముగిశాయి. జనవరి 23 నుంచి 27 వరకు నిర్వహించారు. పతకాల పట్టికలో లడఖ్ అగ్రస్థానంలో ఉంది. లడఖ్ మొత్తం ఏడు పతకాలను దక్కించుకుంది. ఇందులో నాలుగు బంగారు పతకాలు ఉన్నాయి. రెండో స్థానంలో తమిళనాడు నిలిచింది.

## తెలంగాణ

### డ్యూ సాఫ్ట్‌వేర్ సంస్థ

- హైదరాబాద్‌లో రూ. 100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు డ్యూ సాఫ్ట్‌వేర్ సంస్థ సమాయత్తమైంది. 900 మందికి ఉపాధి రానుంది. అలాగే హైదరాబాద్ శివార్లలో హైటెక్ సిటీ తరహాలో మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అధ్యయనాన్ని ప్రారంభించింది.



### పట్టణ తలసరి వ్యయం

- పట్టణ తలసరి సగటు వినియోగ వ్యయంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో కేరళ తొలి స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రంలో ఏడాది కాలంలో తలసరి నెలవారి వినియోగ వ్యయం గ్రామాల్లో రూ. 633, పట్టణాల్లో రూ. 820 పెరిగింది. కుటుంబ వినియోగ వ్యయ సర్వే 2023-24 ఈ వివరాలను వెల్లడించింది. గ్రామాల్లో తలసరి నెలవారి ఖర్చు రూ. 5435 ఉండగా, పట్టణాల్లో రూ. 6199గా ఉంది. సర్వేలోని ఇతర అంశాలు..
- విద్యపై గ్రామీణ ప్రాంతాల్లో నెలకు తలసరి రూ. 183, పట్టణాల్లో రూ. 713.89 వ్యయం చేస్తున్నారు. పట్టణాల్లో చదువుల కోసం అయ్యే వ్యయం తెలంగాణలో అత్యధికంగా ఉందని నివేదిక వెల్లడిస్తుంది.
- గ్రామాల్లో వైద్యం కోసం నెలకు రూ. 376, పట్టణాల్లో నెలకు రూ. 426 చొప్పున వ్యయం అవుతుందని సర్వే తేల్చింది.

### పోలవరం ముంపు అధ్యయనం

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్ట్ వెనుక జలాల ముంపుపై సమగ్ర అధ్యయనం చేయాల్సిందిగా ఐఐటీ హైదరాబాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. గతంలో జరిగిన అధ్యయనాలు, ప్రస్తుతం పరిశీలించాల్సిన అంశాల వివరాలను అందులో పేర్కొన్నారు. 2022 జూలైలో గోదావరికి 22.50 లక్షల క్యూసె



క్కుల వరద వచ్చింది. అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించి పూర్తి స్థాయి నీటిని నిల్వ చేసినప్పుడు వచ్చే గరిష్ఠ వెనుక జలాల ముంపు ఏ మేరకు ఉంటుందనే అంశాలపై అధ్యయనం చేయాలి.

### భూసంస్కరణలకు కమిటీ

- రాష్ట్రంలో కొత్తగా భూసంస్కరణలు తెచ్చేందుకు, రెవెన్యూ శాఖకు న్యాయ వివాదాల్లో సలహాలు ఇచ్చేందుకు భూభారతి చట్టం అమలుకు నూతన మార్గదర్శకాల రూపకల్పనలో సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసింది. భూ న్యాయ చట్టాలు, రెవెన్యూ అంశాల్లో నిపుణులైన ముగ్గురిని కమిటీలో నియమించనున్నారు. వీరిలో ఒక ముఖ్య న్యాయ సలహాదారు, రెండు న్యాయ సలహాదారుల పోస్టులు ఉంటాయి.

### నాలుగు పథకాలు ప్రారంభం

- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను జనవరి 26న ప్రభుత్వం ప్రారంభించింది. నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 606 మండలాల్లో ఒక్కో గ్రామం చొప్పున ఎంపిక చేసిన పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులకు అందజేశారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి మార్చి 31లోగా రాష్ట్రమంతటా అర్హులైన వారికి పథకాలను అందించనున్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 6 వేల చొప్పున ఏటా రెండు సార్లు ఇస్తారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా భూమిలేని నిరుపేదలకు రూ. 6 వేల చొప్పున ఏటా రెండు సార్లు ఇస్తారు. ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పనిచేసిన వారిని అర్హులుగా నిర్ధారించారు. రేషన్ కార్డుల పథకం కింద కొత్త కార్డులతో పాటు పాత కార్డుల్లో మార్పులు చేపడుతున్నారు.



### నీటి పారుదల ప్రాజెక్ట్‌ల పేరు మార్పు

- తెలంగాణ ప్రభుత్వం రెండు నీటి పారుదల ప్రాజెక్ట్‌ల పేర్లలో మార్పులు చేసింది. పాలమూర్ రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి పేరు పెట్టారు. ఎస్ జైపాల్ రెడ్డి పీఆర్ఎల్ఐ ప్రాజెక్ట్‌గా పిలుస్తారు. అలాగే సింగూర్ ప్రాజెక్ట్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ తండ్రి దివంగత సిలారపు రాజనర్సింహ ప్రాజెక్ట్‌గా పిలవనున్నారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

